# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 19-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ ఉద్యోగులను మరింత సమర్థంగా తీర్చి దిద్దే "కర్మ యోగి శపథ్ - జాతీయ అభ్యాస" వారోత్సవాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభిస్తారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**
3. **తెలంగాణా గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షలు నిర్ణయించిన మేరకు ఈ నెల 21వ తేదీ నుండి జరగనున్నాయి.**
4. **మూసీ నది నీటిని తాగు నీటి యోగ్యంగా చేయడమే తెలంగాణా ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సబ్సిడీ సరుకులను ప్రజలకు సక్రమంగా సరఫరా చేయని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.**

==========================

ప్రభుత్వ ఉద్యోగులను మరింత సమర్థవంతంగా తీర్చి దిద్దేందుకు ఉద్దేశించిన "కర్మ యోగి శపథ్-జాతీయ అభ్యాస వారోత్సవాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు డిల్లీలో ప్రారంభిస్తారు. భారతీయత భావన ...., అంతర్జాతీయ దృక్పథం కలిగిన ప్రభుత్వ ఉద్యోగులను సంసిద్ధులను చేయడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ప్రధానోద్దేశం. 2020 సెప్టెంబర్‌లో ప్రారంభమైన కర్మయోగి కార్యక్రమం ఇప్పటి వరకు గణనీయమైన పురోగతి సాధించింది. ప్రభుత్వ ఉద్యోగులు తమ వ్యక్తిగత ... సంస్థాగత సామర్థ్యాలను మెరుగుపరుచుకునేలా ఈ కార్యక్రమం ప్రేరణ ఇస్తోంది. కర్మ యోగి శపద్-జాతీయ అభ్యాస వారోత్సవాలలో భాగంగా వివిధ మంత్రిత్వ శాఖలు ..., విభాగాలు ...., సంస్థలు సదస్సులు ...., కార్యశాలలు నిర్వహిస్తాయి.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల నుండి వచ్చే ప్రతి వినతిని పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగు దేశం పార్టీ శ్రేణులకు సూచించారు.

గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న జరిగిన తెలుగు దేశం పార్టీ పార్లమెంట సభ్యులు..., శాసన సభ్యులు ...., శాసన మండలి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .... ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా

ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ..., ప్రతి సమస్యా పరిష్కారం కావాలని స్పష్టం చేశారు.

... రాష్ట్ర ప్రజలు మనపై విశ్వాసం ఉంచి గురుతరమైన బాధ్యత అప్పగించారని ..., ప్రజల నమ్మకాన్ని మనం నిలబెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు సభ్యులు ...శాసన సభ్యులు ... శాసన మండలి సభ్యులు ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ కలిసికట్టుగా కృషి చేయాలని చంద్రబాబు నాయుడు సూచిస్తూ .....

..వాయిస్..27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంలో మార్పులు చేస్తూ రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక అవసరాలకు రీచ్‌ల నుండి ఎడ్ల బండ్ల ద్వారానే ఇసుక తీసుకు వెళ్లేందుకు ప్రస్తుతం అనుమతి ఉంది. కాగా ... రీచ్‌ల నుండి ఎడ్ల బండ్లతో పాటు ట్రాక్టర్లలో కూడా ఇసుక తీసుకు వెళ్లేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ప్రస్తుత విధానంలో మార్పులు చేసింది. ఉచిత ఇసుకపై సమీక్ష జరిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటూ ఇసుక ధరలను పెంచి వేస్తోందని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... తమ ప్రభుత్వ హయాంలో ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేశామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పాలన సక్రమంగా లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేదని ..., ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో ఇన్ని రోజులూ ప్రభుత్వాన్ని నడుపుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నప్పటికి ... ఎన్నికలలో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయడంలో విఫలమైందని జగన్ మోహన రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో నిర్వహించనున్న గ్రూప్ – 1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను హై కోర్టు నిన్న త్రోసిపుచ్చింది. దీంతో ... ఈ నెల 21వ తేదీ నుండి గ్రూప్ – 1 పరీక్షలు నిర్వహించడానికి మార్గం సుగమం అయింది. ఈ అంశంపై సింగిల్ బెంచ్ తీర్పును హై కోర్టు డివిజన్ బెంచ్ సమర్థిస్తూ .... నిర్ణయించిన తేదీల ప్రకారం ఈ నెల 21వ తేదీ నుండి గ్రూప్ – 1 పరీక్షలు నిర్వహించాలని తీర్పు వెలువరించింది. అభ్యర్థులకు బయో మెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని కోర్టు స్పష్టం చేసింది.

మరొక వైపు ....ఈ పరీక్షల నిర్వహణ కోసం తెలంగాణా పబ్లిక్ సర్వీసు కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. హైదరాబాదు ..., రంగారెడ్డి ..., మేడ్చల్ జిల్లాలలో 46 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట 30 నిముషాల తరువాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు తెలిపారు.

---------------------------

మూసీ నది నీటిని తాగు నీటి యోగ్యంగా చేయడమే తెలంగాణా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్ ..., గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

మూసీ పరివాహక స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికీ రెండు లక్షల రూపాయల చెక్కులను ఆమె నిన్న పంపిణీ చేస్తూ..... ఈ సంఘాల మహిళలకు ప్రభుత్వం చేయూత నిస్తోందని చెప్పారు. మనం జీవించే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని ...., అందువల్లనే ... మూసీ నది ప్రక్షాళనను ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. మూసీ నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

---------------------------

మూసీ నది సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదని కేంద్ర బొగ్గు ..., గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాదులో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ... డ్రైనేజ్ సమస్య పరిష్కారం కాకుండా మూసీ నది సుందరీకరణ జరగదని పేర్కొన్నారు. ప్రస్తుత మూసీ నదికి రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మించి అభివృద్ధి చేయవచ్చునని ...., స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మూసీ నది సుందరీకరణ చేపట్టాలని సూచించారు.

---------------------------

తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నైపుణ్య విశ్వవిద్యాలయానికి అదానీ గ్రూప్ వంద కోట్ల రూపాయల మేర విరాళం అందజేసింది. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ హైదరాబాదులో నిన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కలిసి వంద కోట్ల రూపాయల చెక్కును అందజేశారు. రాష్ట్రంలో యువతకు నైపుణ్యాలు పెంపొందించేలా రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తోంది. 17 రకాల కోర్సులలో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం నైపుణ్య విశ్వవిద్యాలయం ప్రధాన లక్ష్యం.

---------------------------

తెలంగాణా ప్రభుత్వం రాష్ట్రంలో తొమ్మిది విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను నియమించింది. పాలమూరు ..., కాకతీయ ...., ఉస్మానియా ..., శాతవాహన ...., మహాత్మగాంధీ ...., జయశంకర్ తదితర విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

ప్రభుత్వ సబ్సిడీ సరుకులను ప్రజలకు సక్రమంగా అందించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.

వంట నూనె దిగుమతి దారులు ...., కందిపప్పు సరఫరాదారులతో విజయవాడ నగరంలో నిన్న నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... పెరిగిన ధరల నుండి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు తక్కువ ధరకు వంటనూనెను అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. మార్కెట్ ధరలకు కందిపప్పు కొనుగోలు చేసి సబ్సిడీ ధరలపై ప్రజలకు అందజేయడానికి వ్యాపారులు సహకరించాలని సూచించారు. టెండర్‌లో పేర్కొన్న విధంగా ప్రజలకు నాణ్యమైన కందిపప్పును సరఫరా చేయకపోతే చర్యలు తీసుకుంటామని నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎయిడెడ్ పాఠశాలల మూసివేత వల్ల జరిగిన పరిణామాలపై ఉన్నత స్థాయీ సంఘం అధ్యయనం చేస్తోందని ఐ.టి., మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖ పట్నం పర్యటన సందర్భంగా నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి అందిస్తారు.

..వాయిస్..27 సెకన్లు

---------------------------

విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియా సోకి నిన్న ఒక వృద్ధురాలు మరణించడంతో ఈ వ్యాధికి గురై ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య 7కి పెరిగింది.

---------------------------

మధ్య బంగాళాఖాతంలో వచ్చే నాలుగు లేదా ఐదు రోజులలో మరొక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణా సంస్థ తెలిపింది. ఈ అల్పపీడనం వాయవ్య దిశగా పయనిస్తూ మరింత బలపడి అక్టోబర్ 24 వ తేదీ నాటికి వాయుగుండంగా మారుతుందని ...., అయితే ... ఈ వాయుగుండం కదలికలపై మరింత స్పష్టత రావలసి ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు ..., మరి కొన్ని ప్రాంతాలలో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణా శాఖ వివరించింది.

=====================